## ఇస్రో విజయంపై శ్రీసిటీ ఎండీ అభినందనలు

**ప్రజాశక్తి - వరదయ్యపాలెం**

గురువారం స్పేస్ డాకింగ్ ప్రయోగం (స్పేడెక్స్) విజయవంతం కావడంపై ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్‌కు, ఇస్రో బృందానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంతరిక్షంలో ఉపగ్రహాల అనుసంధానం (డాకింగ్) చేయగల సత్తా కలిగిన 4వ దేశంగా భారతదేశాన్ని నిలిపిందని, ఈ విజయాన్ని అందించిన ఇస్రో బృందం కృషి అంకితభావాన్ని కొనియాడారు. ఇస్రో కొత్త చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్. నారాయణన్‌కు అభినందనలు తెలిపారు. డాక్టర్ నారాయణన్ నాయకత్వంలోని ఈ మైలురాయి భవిష్యత్తులో మానవ అంతరిక్షయాన మిషన్‌లకు గట్టి పునాది వేస్తుందన్నారు. ఇస్రో అంకితభావాన్ని ప్రశంసిస్తూ, విజయ పరంపర నిరంతరం కొనసాగాలంటూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# రారండోయ్... వేడుక చేద్దాం..!

### ప్రకృతి ప్రేమికులు రావాలని పిలుపు
### రేపటినుంచే ఫ్లెమింగో ఫెస్టివల్
### ఐదు చోట్ల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**

ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఈనెల 18-20 తేదీల్లో ప్రకతి, సంస్కృతి, జీవవైవిధ్యాల మహోత్సంగా వేడుకగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ చెప్పారు. ప్రకతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకునే ఫ్లెమింగో ఫెస్టివల్ 2025 ను ప్రజలు, పర్యావరణ ప్రేమికులు సందర్శించాలని పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కల్లెక్టరేట్ వీడియో కాన్ఫెరెన్స్ హాల్ నందు జెసి శుభం బన్సల్, జిల్లా అటవీ కన్జర్వేటర్ అధికారి సెల్వం, ఆర్డీ టూరిజం రమణ ప్రసాద్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఫ్లెమింగో ఫెస్టివల్ 2025 ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నామని అన్నారు. 2020 సంవత్సరం వరకు ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రతి సంవత్సరం నిర్వహించి ఉన్నారని, గత నాలుగు సంవత్సరాలుగా ఈ ఫ్లెమింగో ఫెస్టివల్‌ను నిర్వహించలేదని, ప్రస్తుత ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఫ్లెమింగో ఫెస్టివల్ 2025ను ఘనంగా రాష్ట్ర పండుగ రీతిలో నిర్వహించాలని సూచించారని తెలిపారు. మన జిల్లాలో ఫ్లెమింగో ఫెస్టివల్‌ను మూడు రోజులపాటు ఐదు ప్రాంతాలలో నేలపట్టు, బి.వి పాలెం, అటకానితిప్ప, శ్రీ సిటీ, సూళ్లూరుపేట నందు ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండరాదని అధికారులకు ఆదేశించి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. నేలపట్టు పక్షుల అభయారణ్యం నందు ఉన్న విలక్షణ, పర్యావరణ వైవిధ్యం కారణంగా గ్రేపెలికాన్ పక్షులు, కార్మోనెట్ బిల్ పక్షులు(నీటి కాకులు), స్పూన్ బిల్ స్టాక్ పక్షులు, ఓపెన్ బిల్ స్టాక్ పక్షులు తదితర అరుదైన పక్షులు నేలపట్టు అభయారణ్యానికి ఆలవాలమని తెలిపారు. వలస పక్షులు సౌత్ ఈస్ట్ ఆసియా సుదూర విదేశీ ప్రాంతాల నుండి వచ్చి వాటి సంతతిని పెంపొందించుకొని తిరిగి స్వంత ప్రాంతాలకు వెళ్తాయని, అలాగే ఫ్లెమింగో పక్షులు ఆహారం కొరకు వలస వచ్చి స్వంత ప్రాంతాలకు తిరిగి వెళ్ళిపోతాయని అన్నారు. ఈ విలక్షణ పక్షులను సందర్శించడానికి, విజ్ఞానాన్ని పెంపొందించుకొనడానికి వీలుగా నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం నందు విలక్షణ పెలికాన్ పక్షుల వీక్షణ, అటకానితిప్ప పులికాట్ పక్షుల రక్షిత కేంద్రం వీక్షణ పాయింట్ల నందు ఫ్లెమింగో పక్షుల వీక్షణ ఏర్పాటు తగినన్ని బైనాక్యులర్లు ఏర్పాటు చేశామని, బీవీపాలెం నందు 35 బోట్లు ఏర్పాటుతో లైఫ్ జాకెట్ లైఫ్ బాయ్ ల ఏర్పాటుతో బోటింగ్ ఏర్పాటు చేశామని, కంట్రోల్ రూమ్ లు ఎర్పాటు చేశామని, స్థానికంగా వున్న 50 మందిని గైడులుగా నియమిస్తున్నామని తెలిపారు. పర్యావరణ వైవిధ్య అంశాలపై ఎకో ఫ్రెండ్లీ బయో డైవర్సిటి అంశాలపై పలువురు నిష్ణాతులతో మేథో మథన సదస్సులు 3 రోజులు నిర్వహించి తద్వారా ఒక మంచి ప్రణాళిక తయారీకి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే సూళ్లూరుపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో పలు స్టాల్ లు ఏర్పాటుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఫ్లెమింగో ఫెస్టివల్ 2025 ను ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సుమారు 200 రకాల పైగా పక్షులు వస్తాయని, అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని అన్నారు. అటవీ శాఖ, పర్యాటక శాఖ, శ్రీసిటీ తదితర ఇన్స్టిట్యూషన్ లు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ఈ కార్యక్రమ నిర్వహణకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. సీనియర్ అధికారులకు ఈ ఐదు ప్రాంతాలకు ఇంఛార్జి బాధ్యతలు అప్పగించామని తెలిపారు. నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రానికి ఇన్చార్జి అధికారిగా గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆటకానితిప్ప పక్షుల రక్షిత కేంద్రానికి పిడి వెలుగు శోభన్ బాబు, బీవీ పాలెం బోటింగ్ ప్రాంతానికి ఇన్చార్జిగా డిడి మత్స్య శాఖ నాగరాజు, సూళ్లూరుపేట జూనియర్ కళాశాల ప్రాంగణం నందు ఏర్పాటు చేసిన వెన్యూ ఇన్చార్జిగా పిడి డ్వామా శ్రీనివాస ప్రసాద్, శ్రీసిటీ వెన్యూ నందు స్టేట్ సిల్వికల్చరిస్ట్ నరేంద్రన్ లకు విధులు కేటాయించడం జరిగిందని, మొత్తం కార్యక్రమానికి జెసి శుభం బన్సల్ నోడల్ అధికారిగా ఉంటారని, జిల్లా ఎస్పీ, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ కన్వీనర్ లుగా ఉంటారని ఈ కార్యక్రమం జిల్లా టూరిజం కౌన్సిల్ చైర్మన్ ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. పెద్ద ఎత్తున పర్యాటకులు ఇతర రాష్ట్రాల నుండి కూడా వస్తారని అంచనా వేసి తదనుగుణంగా ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. సదరు ఫ్లెమింగో ఫెస్టివల్ సాంస్కృతిక కార్యక్రమాల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వనున్నామని, స్థానిక ఆహార అలవాట్ల మేరకు ఫుడ్ కోర్టు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతాలు ఎకో సెన్సిటివ్ జోన్ లో ఉన్నాయని, సదరు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం మన బాధ్యత అని, ఈ ఫ్లెమింగో ఫెస్టివల్ కు వచ్చేవారు ప్లాస్టిక్ వాడకం లేకుండా పర్యావరణ హితమైన వాటిని వాడాలని, ఇక్కడికి వచ్చు పక్షులకు హాని జరగకుండా ఉండటానికి మనవంతు బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు. అనంతరం ఫ్లెమింగో ఫెస్టివల్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.

క్రీడా వికాస కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బొజ్జల సుధీర్‌రెడ్డి, అనిమిని రవినాయుడు

## 'క్రీడా వికాసం'.. కూటమి ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

క్రీడలు..క్రీడాకారుల వికాసానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు సంయుక్తంగా అన్నారు. శ్రీకాళహస్తిలో వీరిరువురూ క్రీడావికాస కేంద్రాన్ని గురువారం పున్ణప్రారంభించారు. తొలుత క్రీడావికాస కేంద్రంలో ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్, యోగా హాల్, మల్టీపర్పస్ జిమ్, క్రీడాపరికరాలను వినియోగంలోకి తెచ్చారు. అనంతరం నిర్వహించిన సభనిద్దేశించి సుధీర్ రెడ్డి, రవినాయుడు మాట్లాడుతూ గత అక్టోబర్ నెలలో క్రీడావికాస కేంద్రాన్ని సందర్శించామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అసంపూర్తిగా నిలిచిపోయిన కేవీకేను క్రీడాకారులు వినియోగించుకోలేక పోయారన్నారు. తాము పరిశీలించిన తక్షణమే కేవీకేను వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. క్రీడాంధ్రప్రదేశే లక్ష్యంగా దేశంలోనే అత్యుత్తమంగా ఏపీ స్పోర్ట్స్ పాలసీని అమలు చేస్తున్నామనీ, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాను 2శాతం నుంచి 3శాతానికి పెంచామన్నారు. అలాగే క్రీడాకారుల ప్రోత్సాహకాలను భారీగా పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. 2027లో ఏపీలో జాతీయ క్రీడలు నిర్వహించేదిశగా కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోందని వివరించారు.

## టెన్నికాయిట్ జాతీయ క్రీడాకారిణికి అభినందనలు

**ప్రజాశక్తి - గూడూరు టౌన్**

ఈనెల 11,12 తేదీల్లో పలాసలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ టెన్నికాయిట్ పోటీలలో ద్వితీయ స్థానం సాధించిన ఉమ్మడి నెల్లూరు జిల్లా క్రీడాకారిణి నారిపాక మానసను గూడూరు నియోజవర్గం ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ తన నివాసం వద్ద సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని తిమ్మసముద్రం గ్రామానికి చెందిన క్రీడాకారిణి రాష్ట్ర స్థాయి పోటీలలో ద్వితీయ స్థానం సాధించి జనవరి 31 వ తేదీ నుండి చెన్నై నగరంలో జరుగు టెన్నికాయిట్ జాతీయ పోటీలలో పాల్గొనబోవడం అభినందనీయమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న నెల్లూరు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్, సెక్రటరీ రమ్య , అసోసియేషన్ కార్యవర్గ సభ్యుల కషి హర్షణీయమని, భవిష్యత్తు లో మరికొంత మంది క్రీడాకారులను తయారు చేసి మన గూడూరుకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఏషియన్ బాడీ బిల్డింగ్ గేమ్స్‌కు తోటి వెంకటేష్

**ప్రజాశక్తి - పిచ్చా టూరు**

ఏషియన్ బాడీ బిల్డింగ్ గేమ్స్‌కు తోటి వెంకటేష్ ఎంపికైనట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాడీ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రకటించారని పిచ్చాటూరు సర్పంచ్ , కె.జి. హైడ్రోలిక్ జిమ్ వ్యవస్థాపకుడు కె.జీ రోస్ రెడ్డి పేర్కొన్నారు. కె.జి. హైడ్రోలిక్ జిమ్ ఆవరణలో తోటి వెంకటేష్‌ను శాలువతో సత్కరించి మెడల్ , ట్రోఫీ అందించి అభినందించారు. సర్పంచ్ కె.జి.రోస్ రెడ్డి మాట్లాడుతూ మధ్యప్రదేశ్ ఇండోర్‌లో ఎంపీ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నిర్వహించిన మిస్టర్ ఇండియా జాతీయ బాడీ బిల్డింగ్, మెన్ ఫిజిక్ చాంపియన్‌షిప్ 60 కేజీల జూనియర్ విభాగం పోటీల్లో కె.జి. హైడ్రోలిక్ జిమ్ కోచ్ తోటి వెంకటేష్ జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించినట్లు చెప్పారు. మే నెలలో థాయిలాండ్‌లో నిర్వహించే పోటీలకు వెళ్లనున్నారని తెలిపారు

# కట్టడాలపై నిర్లక్ష్యం..పిచ్చిమొక్కలే సాక్ష్యం..!

## అంజూరు మండపానికి భద్రత కరువు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థాన అధికార యంత్రాంగం ఏ పని చేసినా..ఏ నిర్ణయం తీసుకున్నా వింత అనేది మాత్రం ఖచ్చితం. 'ఎవరేమనుకున్నా తమకు ఎందుకులే అనే నిర్లక్ష్యమో లేక 'నవ్విపోదురు గాక మాకేటి సిగ్గు తిట్టి పోదురు గాక మాకేటి ఎగ్గు' అనే ధోరణో తెలియదు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా పశువుల పండుగ సందర్భంగా బుధవారం దేవస్థానం ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణం ఉత్సవం వేడుకగా, ఆర్భాటంగా నిర్వహించారు. చలువ పందిళ్లు, షామియానాలు, అన్నదాన కార్యక్రమాలు, ప్రసాదాలు పంపిణీ అన్నీ జరిగాయి. భక్తులు కూడా సంతోషించారు. అయితే ప్రధాన విడిది మండపం అయిన అంజూరు మండపాన్ని గురించి మాత్రం పట్టించుకోవడం మానేశారు.

**అంజూరు మండపానికి భద్రత కరువు**

తిరుపతి నగరానికి మంచినీటిని సరఫరా చేసే కైలాసగిరి రిజర్వాయర్ నిర్మాణం సందర్భంగా మునక ప్రాంతంలో ఉండిన అంజూరు మండపాన్ని కొండకు పక్కగా ఎగువ ప్రాంతంలో నిర్మాణం చేశారు. నిర్మాణ లోపమో..!లేక నిర్వహణా లోపమో తెలియదు గానీ వర్షం వస్తే నీళ్లన్నీ లోపలే పడతాయి. అంతేగాకుండా మండపంపై రావి, మర్రి లాంటి వివిధ రకాల మొక్కలు ఏపుగా పెరిగాయి. గిరి ప్రదక్షిణం కోసం రూ. లక్షలు ఖర్చు చేసిన దేవస్థానం అధికారులు, సిబ్బంది మండపం వైపు మాత్రం కన్నెత్తి చూడలేదు అనడానికి

గోడపై ఏపుగా మొలిచిన రావిచెట్టు

పెరుగుతున్న మొక్కలే సజీవ సాక్ష్యం. అసలే శిథిలావస్థలో ఉన్న మండపంపై మొక్కల పెరుగుతున్న నేపథ్యంలో నిర్మాణం మరింతగా దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. హరితాభివద్ధి, నందన వనం సిబ్బందిని ఆలయంలో సర్దుబాటు చేసి వారికి అవసరమైన, అనుకూలమైన సీట్లలో కూర్చోబెట్టి జీతాలు చెల్లిస్తున్న దేవస్థానం అధికారులు అటు అడవిని, ఇటు కొండను గాలికి వదిలేశారు. ఉన్న ఒకే ఒక పురాతనమైన అంజూరు మండపాన్ని సంరక్షించడానికి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. భోగి పండుగ సందర్భంగా సమీప గ్రామాల ప్రజలు ఏపుగా పెరిగిన చెట్లను కొట్టి ట్రాక్టర్లలో తరలించేశారు. ఆలయానికి సమీపంలోని లో బావిలో శ్రీగంధం చెట్టును శుభ్రంగా నరికి తీసుకెళ్లినా ఇప్పటివరకు చర్యలు లేవు. విచారణ లేదు. ఆలయంలో ఎక్కడెక్కడ, ఏ విధంగా, ఎంత ఆదాయం వస్తుందో పరిశీలించి, పరిశోధించే అధికారులకు ఇవన్నీ పట్టించుకునే తీరిక ఓపిక లేనట్టుంది. ఇకనైనా శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న పురాతన కట్టడాల బాగోగులపై అధికారులు శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ప్రయాగ్‌రాజ్‌లో శ్రీవారి కల్యాణాలు వైభవంగా నిర్వహించాలి

### టిటిడి ఈవో జె. శ్యామలరావు

**ప్రజాశక్తి -తిరుమల**

ఉత్తర ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్ లో జరుగుతున్న మహాకుంభమేళలో టిటిడి నిర్వహించనున్న శ్రీవారి కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించాలని టిటిడి ఈవో జె. శ్యామల రావు అధికారులను ఆదేశించారు. ప్రయాగ్ రాజ్ సెక్టార్ - 6లో టిటిడి చేపడుతున్న రోజువారి కార్యక్రమాలపై టిటిడి పరిపాలనా భవనంలోని ఈవో ఛాంబర్ లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ జనవరి 18, 26, ఫిబ్రవరి 3, 12 తేదీలలో జరగనున్న శ్రీవారి కల్యాణోత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఉత్తరాది భక్తులు విరివిగా వచ్చే అవకాశం ఉంటుందని, భక్తుల రద్దీకి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా జనవరి 29న మౌని అమావాస్య, ఫిబ్రవరి 3న వసంత పంచమి, ఫిబ్రవరి 12న మాగ పౌర్ణమి, ఫిబ్రవరి 26న శివరాత్రి లాంటి ప్రధాన రోజులలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, టిటిడి విజిలెన్స్ అధికారులు, ప్రయాగ్ రాజ్ పోలీసులు సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. శ్రీవారి నమూనా ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు చేయాలని సూచించారు. శ్రీవారి భక్తులకు ఉచితంగా ఇచ్చే చిన్న లడ్డూలను సమకూర్చుకోవాలన్నారు.

ప్రయాగ్ రాజ్ లో టిటిడి చేపడుతున్న రోజువారి శ్రీవారి కైంకర్యాలు, సౌకర్యాలను వర్చువల్ ద్వారా టిటిడి ఈవోకు టిటిడి అధికారులు నివేదించారు. శ్రీవారికి రోజువారి సుప్రభాత సేవ నుంచి ఏకాంత సేవ వరకు జరుగుతున్న సేవలను వివరించారు. శ్రీవారి నమూనా ఆలయానికి రోజువారి భక్తులు ఎంత మంది వస్తున్నారు, వారికి ఎలాంటి సౌకర్యాలు చేపడుతున్నారు, టిటిడి సిబ్బందికి ఏర్పాటు చేసిన సౌకర్యాలపై అధికారులను ఈవో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం, సిఈ సత్యనారాయణ, హెచ్ డి పిపి అడిషనల్ సెక్రటరీ పి.వి. రామ్ గోపాల్, ప్రోగ్రాం అధికారి రాజ గోపాల్ పాల్గొన్నారు.

# సొంతూరులో సంక్రాంతి చేసుకోనివ్వలేదు

## కన్నీటి పర్యంతమైన హీరో మంచు మనోజ్

**ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)**

'ఎపుడూ సంక్రాంతి పండుగను సొంతూరైన రంగంపేటలో చేసుకోవడం ఆనవాయితీ.. ఈసారి నన్ను రానీయలేదు. అవ్వాతాతలకు శ్రద్ధాంజలి ఘటించడానికి అని చెప్పి బతిమలాడి వెళ్లాల్సి వచ్చింది.. చివరకు నా కూతురితో మొదటి సంక్రాంతి పండగ చేసుకోనీకుండా చేశారు' అని ప్రముఖ హీరో మంచు మనోజ్ వాపోయారు. శ్రీ విద్యానికేతన్ విద్యాసంస్థల ఛైర్మన్ మంచు మోహన్‌బాబు చిన్న కుమారుడు మంచు మనోజ్ చంద్రగిరి పోలీసు స్టేషన్‌కు గురువారం విచ్చేశారు. బుధవారం జరిగిన ఘటనపై డిఎస్‌పి ప్రసాద్‌రావు, సిఐ సుబ్బరామిరెడ్డిలతో గంటపాటు కలిసి మాట్లాడారు. అనంతరం పోలీసు స్టేషన్ వద్ద సతీమణి భూమా మౌనికతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రతి ఏడాదీ వచ్చినట్లే ఈ ఏడాదీ సంక్రాంతి పండక్కి వచ్చానని, అయితే సొంతూరులో సంక్రాంతి జరుపుకునే అదృష్టాన్ని తనకు దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుటుంబ సమస్య పరిష్కరించాలని సిఎం చంద్రబాబునాయుడును గానీ, మంత్రి నారా లోకేష్‌ను గానీ, ఎంఎల్ఎ పులివర్తి నానిని తాను అడగలేదన్నారు. మర్యాదపూర్వకంగానే నారా లోకేష్‌ను కలిసానన్నారు. తన కుటుంబంలో కూర్చుని మాట్లాడుకుంటే సర్దుకపోయే సమస్యలు మాత్రమే ఉన్నాయన్నారు. తన ఫొటోలు ఉన్న ఫ్లెక్సీలను తొలగించడం, తనతో తిరగకూడదని బెదిరించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై తప్పుడు ఫిర్యాదు చేశారని మండిపడ్డారు. ప్రెస్‌మీట్ చివర్లో కడుపునొప్పితో ఇబ్బంది పడుతున్నానని మంచు మనోజ్ కన్నీటి పర్యంతమయ్యారు. మనోజ్‌ను చూసి ఆయన సతీమణి భూమ మౌనిక కళ్లనీళ్లు పెట్టుకున్నారు. మంచు మనోజ్ అనుచరులు పళణి, వినాయకలు తమపై విద్యానికేతన్ వద్ద భౌతిక దాడులు జరిగాయని చంద్రగిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారించి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

తనను పెట్టిన ఇబ్బందులను వివరిస్తూ కన్నీటి పర్యంతమైన మంచు మనోజ్

# అనుమతి లేకనే... ఎడ్ల బండ్ల పోటీలు

**ప్రజాశక్తి - నాయుడుపేట**

గాయపడిన పేరంశెట్టి పోలయ్య

సంక్రాంతి పండుగ సందర్భంగా తొలిసారిగా నాయుడుపేటలో ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించారు. నాయుడుపేటకు చెందిన వ్యాపారస్తుడు ఆకుల కుబేరుమణి, మరికొంతమంది ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. సూళ్లూరుపేట నియోజకవర్గ ఎంఎల్ఎ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపి నెలవల సుబ్రమణ్యం, టిడిపి సీనియర్ నాయకులు శిరసనంభేటి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ఎస్‌కె రఫీ, టిడిపి యువ నాయకులు నెలవల రాజేష్ పాల్గొన్నారు. అయితే ఈ పోటీలకు పోలీసుల అనుమతి లేదని తెలుస్తోంది. ఈ దుర్ఘటనలో గాయపడ్డ మేనకూరికి చెందిన పేరం శెట్టి పోలయ్యను నాయుడుపేట ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం టిడిపి యువ నాయకులు నెలవలరాజేష్ దగ్గరుండి నెల్లూరు అపోలో హాస్పిటల్‌కు తీసుకెళ్లారు.

సాధారణంగా ఏ పోటీలు జరిగినా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఇబ్బంది లేకుండా భద్రత నిమిత్తం పోలీసుల అనుమతి తీసుకోవాల్సి ఉంది. అయితే నిర్వాహకులు పెద్దపెద్ద నాయకులను ముఖ్య అతిథులుగా ఆహ్వానిస్తూ పోలీసులకు తెలియజేయకపోవడం గమనార్హం. విశాలమైన ప్రదేశంలో నిర్వహించాల్సిన పోటీలను, చిన్న స్టేడియంలో నిర్వహించడమూ విమర్శలకు తావిచ్చింది. వీరి నిర్లక్ష్య ధోరణి వల్ల ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థలం చిన్నది కావడంతో ఎద్దులు అదుపు తప్పి ప్రజలపైకి దూసుకొచ్చాయి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా పెద్దమొత్తంలో జనం గాయపడే పరిస్థితి ఉంది. ప్రకాశం, కృష్ణా, గోదావరి జిల్లాల్లో విశాలమైన స్థలాల్లో నిర్వహిస్తూ భద్రతా నియామాలు పాటిస్తూ ఉంటారని సమాచారం. అయితే నాయుడుపేటలో ఇరుకు సందులో ప్రహరీగోడ నిర్మించి ఉన్న స్థలంలో ఇలాంటి పోటీలను నిర్వహించడంపై విమర్శలు వినిపించాయి. ఏ ఘటనా జరగనంత వరకూ బాగానే ఉంటుందని, ఏదైనా జరిగిన తరువాత నిర్వాహకుల నిస్సహాయత బయట పడుతుందని స్థానికులు మండిపడుతున్నారు.

**డోర్నకంబాల, మల్లయ్యపల్లెల్లో పరుష పందేలు**

**ప్రజాశక్తి -రామచంద్రాపురం ( చంద్రగిరి)**

మండలంలోని డోర్నకంబాల, మల్లయ్యపల్లెల్లో పరుష పందేలు గురువారం ఆహూతులను ఆకట్టుకున్నాయి. కోడిగిత్తల రంకెలతో, యువకుల జోరుతో జల్లికట్టు జోరుగా సాగింది. ఈ పందేలను చూసేందుకు వచ్చిన ప్రేక్షకులకు గ్రామస్తులు పులిహోర, అన్నం, వాటర్‌ప్యాకెట్లను అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## ఫల సరుకులు పంపిణీ

**ప్రజాశక్తి - గూడూరు టౌన్**

లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వై.జె.పి. టౌన్ క్లబ్ సేవా కార్యక్రమంలో భాగంగా గూడూరు లోని డి.ఎన్.ఆర్ కమ్యూనిటీ హాల్ నందు పేదలకు ఫలసరుకులను పంపిణీ చేశారు. అనంతరం మాజీ జోన్ చైర్మన్ గురునాథం పుట్టినరోజు సందర్భంగా లయన్స్ సభ్యులు అందరూ కలిసి కేక్ కటింగ్ చేశారు. అనంతరం దుప్పట్లు పంపిణి చేశారు. ప్రతి ఒక్కరూ సేవా దక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. యువత సేవా కార్యక్రమాల పై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ మనోజ్ కుమార్ , అడిషనల్ సెక్రటరీ మురళి రాజు, గూడూరు టౌన్ క్లబ్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యం యాదవ్ పాల్గొన్నారు.

## నాన్‌టీచింగ్ ఉద్యోగులకు జీతభత్యాలు చట్టప్రకారం ఇవ్వాలి

**ప్రజాశక్తి - కోట**

ఎన్‌బికెఆర్ఐఎస్‌టి నాన్ టీచింగ్ ఉద్యోగులకు చట్ట ప్రకారం జీతభత్యాలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి తిరుపతి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.రాధాక్రిష్ణ డిమాండ్‌చేశారు. గురువారం మండలంలోని కొత్తపాలెం రోడ్డులో రిటైర్డ్ ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ఉద్యోగి అరుణ్‌కుమార్ నిఆసంలో సమీక్షా సమావేశం జరిగింది. గతంలో 2020లో లేబర్ కోర్టు గుంటూరు ఇచ్చిన తీర్పును ఎన్ బి కే ఆర్ ఐఎస్టి కాలేజీ యాజమాన్యం తిరస్కరించడం దారుణంగా ఉందన్నారు. ఈ సమస్యను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతామన్నారు.

## వైభవంగా కొండచుట్టు ఉత్సవం

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్**

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో స్థానిక పుత్తూరులో కొండచుట్టు ఉత్సవం వేడుకగా జరిగింది. పుత్తూరు డీఎస్పీ రవికుమార్, టీడీపీ నాయకులు హాజరయ్యారు. కుండ చుట్టూ ఉత్సవాల్లో శాంతి భద్రతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. అనంతరం డి.ఎస్.పి రవికుమార్ కు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, ప్రధానకార్యదర్శి ఎన్.ఎన్.ధనపాల్, టీడీపీ నాయకులు ఈశ్వర్ యాదవ్ పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్‌తో గాలి మురళీనాయుడు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబును కనుమ పండుగ సందర్భంగా బుధవారం నారావారిపల్లిలో తొట్టంబేడు మండల టిడిపి అధ్యక్షులు గారి మురళి నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నట్లు మురళి తెలిపారు. పొయ్యి మాజీ ఎంపిటిసి బత్తల విజయ్ కుమార్ నాయుడు, తెలుగు యువత నాయకులు నాని తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటిస్తే ప్రమాదాలుండవు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలు ఉండవని టూ టౌన్ సీఐ వెంకటేశుఅన్నారు. శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో గ్యారేజీలో గురువారం రోడ్డు భద్రత మాసోత్సవాలు సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా సీఐ వెంకటేశుహాజరయ్యారు. రోడ్డు నియమాలు, వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డ్రైవర్లకు వివరించారు. ఎంఎఫ్ చక్రవర్తి, అసిస్టెంట్ మేనేజర్ చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటుపై ఏబీఆర్‌ఎస్‌ఎం హర్షం

**ప్రజాశక్తి - క్యాంపస్**

ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనను ఏబీఆర్‌ఎస్‌ఎం హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆచార్య వైవి రామిరెడ్డి తెలిపారు. సెంట్రల్ స్కూల్ నుంచి ఉన్నత విద్య వరకు దేశవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు ఈ ప్రకటన కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారన్నారు. ఏబీఆర్‌ఎస్‌ఎం ఈ సమస్యను వివిధ వేదికలపై, ప్రభుత్వంతో సమావేశాల సమయంలో నిరంతరం లేవనెత్తిందన్నారు. ప్రధాన మంత్రి తీసుకున్న సానుకూల నిర్ణయం నిస్సందేహంగా ఉపాధ్యాయులు, ఉద్యోగుల ప్రయోజనాల దష్ట్యా ఒక ముఖ్యమైన అడుగు అన్నారు.

## రైతులకు పంట నమోదుపై అవగాహన

**ప్రజాశక్తి-యర్రావారిపాలెం**

మండలంలోని ఉదయమాణిక్యం, కమళ్ళ పంచాయతీల్లో గురువారం 'పొలం పిలుస్తుంది రా' కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి ఖాదర్ భాషా తెలిపారు. ప్రతి రైతు పండించిన పంటను ఆర్‌ఎస్‌కెలో నమోదు చేసుకొని వరి పంటకు ఎకరాకు రూ.630 పంట బీమాకు ప్రీమియం చెల్లించాలని సూచించారు. ఉలవలు, టమోటా పంటలను పరిశీలించి గ్రామ సభలు నిర్వహించి రబీ సీజన్లో ఎరువుల యజమాన్యం, నివారణపై పాటించవలసిన మెలకువలు గురించి వివరించారు. వ్యవసాయ శాఖలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి రైతులకు వివరించి వాటి ఉపయోగాలు గురించి వివరించారు.

# జక్కా వెంకయ్య శ్రామిక నగర్‌లో సంక్రాంతి సంబరాలు

సిపిఎం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**ప్రజాశక్తి - గూడూరు టౌన్**

గూడూరు పట్టణంలోని జక్కా వెంకయ్య శ్రామిక నగర్‌లో సిపిఎం శాఖ కార్యదర్శి జోగిశివకుమార్, సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కామ్రేడ్ సీతారాం ఏచూరి స్మారక 'ముగ్గుల పోటీలు'ను సంక్రాంతి సంబరాలలో భాగంగా నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలను సిహెచ్ సుధారాణి, జి.వినీల పర్యవేక్షించారు. ముఖ్య అతిథిలుగా గూడూరు తహాశీల్దార్ సి.చంద్రశేఖర్, డాక్టర్.ఎం.ప్రవీణ్ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. మొదటి బహుమతి పి.మహాలక్ష్మి, రెండో బహుమతి జి.సుప్రజ, మూడో బహుమతి ఎం.కావేరి గెలుచుకున్నారు. మిగతా 12 మంది మహిళలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యు సీనియర్ నాయకులు టి.వెంకటరామిరెడ్డి. భవన నిర్మాణ సంఘం సీనియర్ నాయకులు పుట్టా శంకరయ్య, పామంజి మణి, బి.వి. రమణయ్య, ఎస్.సురేష్, అడపాల ప్రసాద్, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఉదయ భాస్కర్, వెంకటేశ్వర్లు, బల్లి గోవర్ధన, మదన్, బి.చంద్రయ్య పాల్గొన్నారు.

### ముగ్గులు మన సంస్కృతికి ప్రతీకలు

ముగ్గులు మన సంస్కృతికి ప్రతీకలు అని తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి పేర్కొన్నారు. చెన్నూరు బీసీ కాలనీ యువత ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు మొదటి బహుమతి 2వేలు, రెండో బహుమతి 1500, మూడో బహుమతి వేయి రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు యరమాపు హేమ కుమార్ రెడ్డి, మాజీ చేనేత సొసైటీ అధ్యక్షులు కటికాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

### క్రీడలతో మానసిక ఉల్లాసం : ఎంఎల్‌ఎ ఆదిమూలం

**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ**

మండలంలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు దేహదారుఢ్యాన్ని పొందవచ్చునని, ఆరోగ్యపరంగా ఎక్కువ లాభాన్ని పొందవచ్చునని, క్రీడలతో ఎలాంటి అనారోగ్యాన్నైనా ఎదుర్కోవచ్చని ఆయన తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సబ్ ఇన్స్పెక్టర్ విశ్వనాథ నాయుడు, కూటమి నాయకులు కలిసి వాలీబాల్ ఆడి అందరిని ఉత్సాహపరిచారు. కన్నయ్య నాయుడు, ముని చంద్ర నాయుడు, దయానాయుడు, కార్తీక్ నాయుడు, రవి నాయుడు, మాజీ జెడ్పిటిసి వీరరాఘవులు పాల్గొన్నారు.

## శ్రీ మూలస్థాన ఎల్లమ్మతల్లికి పట్టు వస్త్రాలు సమర్పణ

**ప్రజాశక్తి -రామచంద్రాపురం ( చంద్రగిరి)**

సంక్రాంతి ఉత్సవాలలో భాగమైన చంద్రగిరి గ్రామదేవతైన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ కొండ చుట్టూ తిరునాళ్ల సందర్భంగా గురువారం ఉదయం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, సుధా రెడ్డి దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రతి ఏడాది కొండ చుట్టూ తిరునాళ్లకు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి మూలస్థాన ఎల్లమ్మ వారికి పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. మేళాతాళాల మధ్య పూర్ణ కుంభంతో ఆలయ అర్చకులు, ఈవో శశి, ఉత్సవ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈఓ ఎం గోపీనాథ్, రమేష్ బాబు ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## క్రికెట్ ఫైనల్స్ విజేతలకు బహుమతులు ప్రదానం

**ప్రజాశక్తి -రామచంద్రాపురం (పాకాల)**

సంక్రాంతి ఉత్సవాలలో నిర్వహించిన కూటమి క్రికెట్ విజేతలకు ఎమ్మెల్యే పులివర్తి నాని బహుమతులు ప్రదానం చేశారు. గురువారం పాకాల మండలం మద్దినాయనపల్లి పంచాయతీ మద్దినాయనపల్లి గ్రామంలో క్రికెట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరయ్యారు. విన్నర్లకు 9,999 రూపాయలు, రన్నర్లకు 7,777కు నగదును బహుమతిగా అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి క్రికెట్ ఫైనల్స్ కమిటీ సభ్యులు మల్లికార్జున, గోపీనాథ్ రెడ్డి, హరీష్ పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా : నేదురుమల్లి

**ప్రజాశక్తి- వెంకటగిరి**

వైయస్సార్సీపి కార్యకర్తలకు ఎప్పుడు అండగా అందుబాటులో ఉంటానని వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి కార్యకర్తలకు భరోసానిచ్చారు. స్థానిక నేదురుమల్లి నివాసంలోని ఎన్ జే ఆర్ భవనంలో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మళ్లీ రాబోయేది వైయస్సార్సీపి ప్రభుత్వమేనని, వైయస్ జగన్మోహన్ రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి కావడం తధ్యమని తెలిపారు .విద్యుత్ చార్జీల పెంపు పై శాంతియుతంగా ర్యాలీ చేస్తుంటే తనతో సహా 11 మందిపై అక్రమ కేసులు పోలీసులు బనాయించారన్నారు . ఇటీవలే వైసిపి కార్యకర్త పేచిరాజ్ పై అక్రమంగా గంజాయి కేసు మోపారని విమర్శించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే కోర్టులో కేసు వేసామనిచెప్పారు . టీచర్స్ కాలనీలో కూల్చివేతల వలన మనస్థాపనతో ఓ వ్యక్తి మతికి కారణమయ్యారని, ఆక్రమణలు ఉంటే నోటీసులు ఇచ్చి పద్ధతి ప్రకారం తొలగించాలని అన్నారు. అనంతరం ఇటీవల మతి చెందిన పలువురు వైసీపీ నాయకుల కుటుంబాలను పరామర్శించారు.

## వృద్ధులకు తోడ్పాటునిద్దాం

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

నిరాదరణకు గురైన వృద్ధులకు తోడ్పాటునందిద్దామని ఏక్తా యాంటీ కరప్షన్ జిల్లా అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ పిలుపునిచ్చారు. ఏక్తా యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద సాధువులకు దుప్పట్లు పంపిణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలంలో ఎంతో మంది సాధువులు, వద్దులు వంతెన మీద నిద్రిస్తూ చలికి ఎంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి తమవంతు సాయం చేయాలనే ఉద్దేశంతో సంక్రాంతి నాడు కుల మతాలకు అతీతంగా దుప్పట్లు అందచేసినట్లు తెలిపారు. ప్రభుత్వాలు వృద్ధుల సంక్షేమానికి ప్రతి ఏటా బడ్జెట్ కేటాయించి వారికి చేయూత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీడియా అధ్యక్షురాలు యాసిన్, జాతీయ మానవహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ కలాం, సీపీఎం నాయకులు అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు అందిస్తూ...

## మహా కుంభమేళాలో అలరించిన శరత్ చంద్ర ప్రదర్శన

**ప్రజాశక్తి - క్యాంపస్**

మహా కుంభమేళాలో డాక్టర్ పరంకుశం శరత్ చంద్ర బంద భరతనాట్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రయాగరాజ్‌లో జరుగుతున్నటువంటి మహా కుంభ మేళాలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్వహించిన శ్రీవారి నమూనా ఆలయంలో స్వామివారి ఊంజల్ సేవ కార్యక్రమం తరువాత హిందు ధర్మ ప్రచార పరిషత్, శ్రీ వేంకటేశ్వర సంగీత నత్య కళాశాల డాక్టర్ ఎం ఉమా మధుబాల ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్యం కార్యక్రమంలో గురు డా.పరంకుశం శరత్ చంద్ర బందం భరతనాట్యం కార్యక్రమం ఆద్యంతం భక్తులను ఆకట్టుకుంది. బందంలో శరత్ చంద్ర, శివ ప్రసాద్, ఉషాశ్రీ, వీణశర్మ, హేమలత పుష్పాంజలి, శ్రీమన్నారాయణ, కంచదలయతక్చి, శివ తాండవం, భో శంభో, ఇట్టి ముద్దులాడే బాలుడు, వినాయక కౌతం, దశావతార అష్టపది , ముద్దుగారే యశోద, హనుమాన్ చాలీసా, నటన మనోహరణ వంటి కీర్తనలకు తమ హవా భావాలతో భరతనాట్య ప్రదర్శనలు అందరిలో భక్తి భావాన్ని పెంపొందించింది.

హర్షిత్‌రెడ్డికి గజమాలతో సత్కారం

## చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి ఘన సన్మానం

**ప్రజాశక్తి -రామచంద్రపురం (తిరుపతి రూరల్)**

వైయస్ఆర్ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా వైయస్ఆర్ విద్యార్థి విభాగం అధ్యక్షులుగా నియమితులైన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిని డా.బి.ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థి, యువజన సంఘ నేతలు శాలువా, గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించి ఇంజినీర్లు, డాక్టర్లు అయ్యేందుకు తోడ్పాటు అందించారన్నారు. జగన్మోహన్‌రెడ్డి హయాంలోనూ సచివాలయ వ్యవస్థ ద్వారా ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెంగల్ రెడ్డి పాల్గొన్నారు.

### వైసిపి కుటుంబ సభ్యులకు అండగా ఉంటాం : ఆర్‌కె రోజా

**పుత్తూరు టౌన్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు, ప్రజలకు అండగా ఉంటామని మాజీ మంత్రి ఆర్‌కె రోజా తెలిపారు. నగరి నియోజకవర్గం నుంచి వైసిపి రాష్ట్ర మున్సిపల్‌కమిటీ సంయుక్త కార్యదర్శిగా గుణశేఖర్ నియమితులైన సందర్భంగా మాజీ మంత్రి ఆర్‌కెరోజా కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం జరిగింది. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాష్, బాలసుబ్రమణ్యం, గాంధీ, ఆరేటమ్మ ఆలయ మాజీ ఛైర్మన్ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

## చెత్తకుప్పలతో...కంపుకంపు..!

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్**

పుత్తూరు మున్సిపాలిటీపరిధిలోని ఆర్టీసీ బస్టాండ్‌లోపలికి వచ్చే మార్గంలో చెత్త కుప్పలు రోజురోజుకీ పేరుకు పోతున్నాయి. చుట్టూ వాణిజ్య సముదాయాల యజమానులు చెత్తకుప్పలను తెచ్చి అక్కడ పడేస్తున్నారు. రోజువారి తొలగింపులో భాగంగా శుభ్రం చేసి నాలుగు రోజులు గడుస్తోంది. కుప్పలు అలానే దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులకు, పాదచారులకు దుర్వాసన తప్పడం లేదు. ఆర్టీసీ ప్రయాణికులు, చుట్టుపక్కల నివాసితులు ఈ చెత్తకుప్పల వాసన భరించలేక ముక్కుమూసుకుని ఈ మార్గంలో వెళ్లే పరిస్థితి కనిపిస్తోంది.


పుత్తూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద కంపు కొడుతున్న చెత్త

## వైకుంఠ ద్వార దర్శన ఎస్‌ఎస్‌డి టోకెన్లపై సమీక్ష

**ప్రజాశక్తి - తిరుమల**

వైకుంఠ ద్వార దర్శనం ఎస్ఎస్‌డి టోకెన్లపై గురువారం సాయంత్రం ఉన్నతాధికారులతో టిటిడి ఈవో జె.శ్యామలరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. 19న వైకుంఠ ద్వార దర్శనం ముగుస్తున్నందున ఎస్ఎస్‌డి టోకెన్లపై అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్‌పి మణికంఠ చందోలుతో కలిసి సమీక్షించారు. వైకుంఠ ద్వార దర్శనం చివరిరోజు ఎస్ఎస్‌డి టోకెన్ల జారీ శుక్రవారంతో ముగిసే అవకాశం ఉంది. 20న దర్శనం కోరే భక్తులకు 19న ఎస్ఎస్‌డి టోకెన్లు జారీ చేయబడవు. వారు సర్వదర్శనం క్యూలైన్‌లో మాత్రమే శ్రీవారి దర్శనం చేసుకోవాల్సి ఉంటుంది. ఆఫ్‌లైన్‌లోనూ శ్రీవాణి టికెట్లు జారీ చేయబడవు. 20న టిటిడి ప్రోటోకాల్ భక్తులను మినహాయించి విఐపి బ్రేక్ దర్శనాన్ని రద్దు చేసింది. ఈ కారణంగా 19న బ్రేక్ దర్శనం కోసం ఎటువంటి సిఫార్సు లేఖలు స్వీకరించకూడదని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో జీఎం శేషా రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, వీజీవో సదాలక్ష్మి అధికారులు హాజరయ్యారు.

## 'భూఆక్రమణదారు నుంచి భూమిని కాపాడండి'

**ప్రజాశక్తి - క్యాంపస్**

తిరుపతి ఉప్పరపల్లిలోని సర్వేనెంబర్ 13, 14/1 లో భూమి గత 20 ఏళ్లుగా తన ఆధీనంలో ఉందని, భూరికార్డుల ప్రకారం కొనుగోలు చేశానని, అయితే అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు తనను బెదిరించి తన భూమి కబ్జాకు పాల్పడుతున్నాడని బాధితుడు నారాయణస్వామి వాపోయారు. తన భూమిలోకి తనను వెళ్లనీకుండా రౌడీలతో బెదిరిస్తున్నారన్నారు. కోర్టులో సైతం తనకు అనుకూలంగా జడ్జిమెంట్ వచ్చిందన్నారు. అయినా కబ్జాదారు నుంచి తనకు ప్రాణభయం ఉందని, బెదిరింపులకు పాల్పడుతూనే ఉన్నాడని, పోలీసులు తనకు న్యాయం చేయాలని వేడుకొన్నారు.

## తుమ్మలగుంటలో పార్వేట ఉత్సవం

**తిరుపతి సిటి :** తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి పార్వేట ఉత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఒక తిరుచ్చిలో శ్రీ మలయప్ప స్వామి, మరో తిరుచ్చిలో శ్రీకష్ణ స్వామి వేంచేయగా.. పార్వేట మండపంలో పుణ్యాహవచనం, ఆరాధన, నివేదన చేసి హారతులు ఇచ్చారు. అనంతరం శ్రీకష్ణస్వామి వారిని సన్నిధి యాదవ పూజ చేసిన చోటుకు తీసుకెళ్లి పాలు, వెన్న, హారతులు సమర్పించారు. ఈ ఉత్సవంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మీ దంపతులు హాజరయ్యారు. బుధవారం నుంచి సుప్రభాత సేవ పున్హ ప్రారంభమయ్యింది.

### శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో...

తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామివారి ఆలయంలో గురువారం పార్వేట ఉత్సవం ఘనంగా జరిగింది. ప్రతి ఏడాదీ సంక్రాంతి కనుమ పండుగ మరునాడు పార్వేట ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో టిటిడి స్థానిక ఆలయాల డెప్యూటీ ఈవో శాంతి పాల్గొన్నారు.

## 'సాయి కీర్తి' హోండా షోరూంలో సంబరాలు

**ప్రజాశక్తి - గూడూరు టౌన్**

గూడూరు పట్టణంలో సాయి కీర్తి హోండా షోరూంలో గురువారం గూడూరు ఆర్‌టివో కిషోర్ చేతుల మీదుగా యునికార్న్ 160 - ఎస్పీ 125, బి.ఎస్ 6 కొత్త వాహనాలను ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ ప్రతి వాహన వినియోగదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. సాయి కీర్తి హోండా షోరూం అధినేత సురేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మారుతున్న అధునాతన టెక్నాలజీని ముందుగానే ఊహించి అత్యాధునిక సిస్టమ్‌తో వాహనదారులకు మోడల్స్‌ను అందించడంలో హోండా కంపెనీ ముందంజలో ఉంటుందన్నారు. షోరూం అధినేత సురేష్ కుమార్ రెడ్డి, ఆయన కుమారుడు గ్రీష్మంత్ రెడ్డి , సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

నూతన వాహనాలను ప్రారంభిస్తున్న ఆర్టీవో